సంపుటి :02 సంచిక :236 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శుక్రవారం 21, నవంబర్ 2025



## హిడ్మాది ఫేక్ ఎన్‌కౌంటర్

- ఆయన భార్య, సహచరులను పట్టుకుని చంపారు
- మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ బూటకం
- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రకటన

02

## స్పీకర్ ను కలిసిన కడియం

- పార్టీ ఫిరాయింపుపై వివరణకు మరింత సమయం కావాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పీకర్ స్పందించినట్లు సమాచారం

04




# సీఎంఆర్.. డోన్ట్ కేర్ !

## ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న అక్రమాల పర్వం

- ఈనెల 11 నాటికి ముగిసిన సీఎంఆర్ డెలివరీ గడువు
- అయినా ములుగు జిల్లాలో సీఎంఆర్ అప్పగించని రెండు రైస్ మిల్లులు
- ఆ మిల్లులకు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం నిల్వలు కూడా నిల్!
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న సివిల్ సప్లై అధికారులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీఎంఆర్ మాఫియా వేళ్లూనుకున్నట్లు కనిపిస్తున్నది. రైస్ మిల్లర్లు ప్రభుత్వం తమకు కేటాయించిన రూ.వందల కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తూ సీఎంఆర్ డెలివరీ చేయకుండా సర్కార్ కు నష్టం కలిగిస్తున్నారు. తాజాగా ములుగు జిల్లాలో అబ్బాపూర్‌లోని సుగుణ రైస్ ఇండస్ట్రీస్, మంగపేట లోని సాయి సుధ రైస్ ఇండస్ట్రీస్ మిల్లుల యాజమానులు ప్రభుత్వం తమకు కేటాయించిన గత ఖరీఫ్ ధాన్యానికి సంబంధించిన సుమారు 660 టన్నులకు పైగా సీఎంఆర్ ను ఈ నెల 11లోపు ప్రభుత్వానికి డెలివరీ చేయాల్సి ఉండగా గడువు ముగిసినప్పటికీ అప్పగించలేదు. అంతేకాదు ప్రభుత్వం ఈ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ బకాయికి సంబంధించిన గత ఖరీఫ్ ధాన్యం నిల్వలు కూడా సదరు రైస్ మిల్లుల్లో లేవని తెలిసింది. ఇలా పలువురు రైస్ మిల్లర్లు ప్రభుత్వం తమకు కేటాయించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకొని, రేషన్ బియ్యాన్ని సీఎంఆర్ గా డెలివరీ చేయడం లేదా తక్కువ శాతం సీఎంఆర్ అప్పగిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ అక్రమాలను అడ్డుకోవాల్సిన సివిల్ సప్లై అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తుంది. – అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02



## రాష్ట్రంలో 32 మంది ఐపీఎస్ ల బదిలీ

- పాతవారికి స్థానిక చలనం.. కొత్తవారికి పోస్టింగ్స్
- ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామనాథ్
- భూపాలపల్లి ఎస్పీగా సిరిసెట్టి సంకీర్త్
- మహబూబాబాద్ ఎస్పీగా శబరీశ్

05



సుధీర్ రాంనాథ్ కేకన్ శబరీష్ సంకీర్త్

## ఏసీబీ వలలో ‘మిషన్ భగీరథ’ చేప



- బిల్లుల క్లియరెన్స్‌కు రూ.10 వేలు లంచం డిమాండ్
- అసిస్టెంట్ ద్వారా డిజిటల్ పేమెంట్.. రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన డీఈఈ
- జనగామ జిల్లా పాలకుర్తిలో ఘటన

02

## ప్రగతి పథంలో నడపాలి



- మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్
- దిశా సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్

04

# ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచాలి

**- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

అక్షరదర్బార్, హనుమకొండ: శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమించే పోలీసులు తమ వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ మెడికవర్ హాస్పిటల్ సహకారంతో వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నిరంతరం విధి నిర్వహణకు అంకితమైన పోలీసులతో పాటు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్, నెఫ్రాలజిస్ట్, ఫిజిషియన్, న్యూరాలజిస్ట్ గాస్ట్రోఎంటరాలజిస్ట్ విభాగాలకు చెందిన వైద్య నిపుణులచే ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి తరలి వచ్చిన పోలీసుల కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేపట్టడంతో పాటు వైద్యుల సూచనల మేరకు అవసరమైన వారికి బీఎండీ టెస్ట్ (బోన్ మినరల్ డెన్సిటీ), లిపిడ్ ప్రొఫైల్, ఈసీజీ (ఎలక్ట్రోకార్డియోగ్రామ్), టూడీ ఈకో, ఎల్ఎఫ్టీ టెస్ట్ (లివర్ ఫంక్షన్ టెస్ట్), జీఆర్బీఎస్ (రాండమ్ బ్లడ్ షుగర్), సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్) వంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి మెరుగైన సేవలు అందించగలరని, ఆరోగ్య పరిరక్షణ కోసం పోలీసులు ఆరోగ్య పరీక్షలకు సమయాన్ని కేటాయించాలని, రెండు రోజుల పాటు నిర్వహించబడే ఈ శిబిరాన్ని పోలీసులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మెడికవర్ యాజమాన్యానికి సీపీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా హన్మకొండ సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు డీసీపీలు రవి, సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రభాకర్ రావు, బాల స్వామితో పాటు వైద్య ఆరోగ్య అధికారి అప్పయ్య, ఆర్ఐలు, మెడికవర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.








# 'సీఎంఆర్'.. డోంట్ కేర్!

- ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న అక్రమాల పర్వం
- ఈనెల 11 నాటికి ముగిసిన సీఎంఆర్ డెలివరీ గడువు
- అయినా ములుగు జిల్లాలో సీఎంఆర్ అప్పగించని రెండు రైస్ మిల్లులు
- ఆ మిల్లులకు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం నిల్వలు కూడా నిల్!
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అవకతవకల పరంపర ధారవాహికలా కొనసాగుతున్నది. ప్రభుత్వం తమకు కేటాయించిన రూ.వందల కోట్ల విలువైన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు అక్రమంగా దారి మళ్లిస్తున్నారు. ధాన్యాన్ని మిల్లింగ్ చేసి తిరిగి బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు అప్పగించే ప్రాసెస్లో రైస్ మిల్లుల యజమానులు అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రభుత్వం అప్పగించిన ధాన్యంలో 67శాతం బియ్యంగా తిరిగి అప్పగించాల్సి ఉండగా, కొందరు మిల్లర్లు అప్పగించడంలేదు. 2024- 25 సంవత్సరం ఖరీఫ్ ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ డెలివరీ విషయంలో ఇదే జరిగింది. తాజాగా ములుగు జిల్లాలో మరో అక్రమం వెలుగు చూసింది. ఈ జిల్లాలో 2024-25 ఖరీఫ్ లో మొత్తం 39 రైస్ మిల్లులకు ప్రభుత్వం సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయించింది. ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి సీఎంఆర్ డెలివరీ చేయడానికి ప్రభుత్వం రైస్ మిల్లర్లకు ఈనెల 11 వరకు గడువు ఇచ్చింది. కానీ, గడువు దాటినా ఇప్పటివరకు ములుగు మండలం అబ్బాపూర్లోని సుగుణ రైస్ ఇండస్ట్రీస్, మంగపేట మండల కేంద్రంలోని సాయి సుధా రైస్ ఇండస్ట్రీస్ మిల్లుల యజమానులు మాత్రం సీఎంఆర్ వంద శాతం అప్పగించలేదు.

**- కేటాయించిన ధాన్యం వివరాలు**

2024-25 ఖరీఫ్ లో అబ్బాపూర్ సుగుణ రైస్ ఇండస్ట్రీస్ కు ప్రభుత్వం 3,586 టన్నుల ధాన్యం కేటాయించింది. సదరు మిల్లు యజమాని తిరిగి 2,403 టన్నుల సీఎంఆర్ డెలివరీ చేయాల్సి ఉండగా ఈ నెల 11 వరకు 1,918 టన్నుల సీఎంఆర్ (79.83శాతం) మాత్రమే అప్పగించాడు. మిగిలిన 484.48 టన్నుల సీఎంఆర్ అప్పగించనే లేదు. అలాగే మంగపేట సాయి సుధ రైస్ ఇండస్ట్రీస్కు ప్రభుత్వం గత ఖరీఫ్ లో 4,405 టన్నుల ధాన్యం కేటాయించగా, ఈ మిల్లు యజమాని మిల్లర్ 2,951 టన్నుల సీఎంఆర్ అప్పగించాల్సి ఉంది. కానీ, మిల్లర్ 2,776 టన్నుల సీఎంఆర్ (94శాతం) మాత్రమే అప్పగించాడు. మిగిలిన 175.59 టన్నుల సీఎంఆర్ అప్పగించనే లేదు. ఈ మిల్లుల యజమానులు ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేయకుండా ఆలస్యం చేసి, ఆ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో విక్రయించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిల్లులో ధాన్యం నిల్వలు ఉన్నాయో లేదో, మిల్లింగ్ అవుతుందో లేదో చూడాల్సిన కస్టోడియన్ పౌర సరఫరాలశాఖ పట్టించుకోకపోవడం వల్లే మిల్లర్ల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, రైస్ మిల్లర్లతో కుమ్మక్కై, తనిఖీల్లో ఉల్లంఘనలు ఉన్నా కేసులు చర్యలు తీసుకోవడం లేదని, ఇటీవల ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో స్పష్టమైంది.

**- పౌర సరఫరాలశాఖ అలసత్వం**

బ్లాక్ లిస్ట్ లో ఉన్న మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించడం, ఒకే మిల్లుకు రెండు కోడ్ లు కేటాయించి అక్రమంగా ఎక్కువ ధాన్యం కేటాయింపులు జరిగేలా పౌర సరఫరాలశాఖ అధికారులు సహకరించడం వల్లే అక్రమాలు జరుగుతున్నాయని ఇటీవల విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ధాన్యం రికవరీ చట్టం (ఆర్ఆర్ యాక్ట్) ప్రకారం సకాలంలో సీఎంఆర్ అప్పగించని, మిల్లుల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రికవరీకి చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే ములుగు జిల్లాకు చెందిన పౌరసరఫరాల అధికారులు ఆ రెండు మిల్లుల్లో బకాయి పడిన సీఎంఆర్ కు సంబంధించిన ధాన్యం నిలువలు ఉన్నాయా లేదా అని పరిశీలించటం, చర్యలు తీసుకపోతుండటంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఈ అంశంపై మరింత కఠినంగా వ్యవహరించి, సీఎంఆర్ రాబట్టాల్సిన అవసరం ఉంది.

# హిడ్మాది ఫేక్ ఎన్ కౌంటర్

- ఆయన భార్య, సహచరులను పట్టుకుని చంపారు
- మారేడుమిల్లి ఎన్ కౌంటర్ బూటకం
- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రకటన

అక్షరదర్బార్, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ సుప్రీం కమాండర్ మాడివి హిడ్మా, అతని భార్య రాజే ఇతర సహచరుల ఎన్కౌంటర్ బూటకమని, వారిని ఏపీ భద్రతా దళాలు పట్టుకుని కాల్చిచంపాయని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ శుక్రవారం సంచలన ప్రకటన విడుదల చేసింది. అభయ్ పేరిట విడుదలైన ఈ ప్రకటనలో ఏముందంటే.. మావోయిస్టు పార్టీ సభ్యులందరినీ పోలీసులు విజయవాడలో నిరాయుధంగా పట్టుకొని, ఆ తర్వాత మన్యంలో బూటకపు ఎన్కౌంటర్ ద్వారా హత్య చేశారని ఆరోపించారు. 'హిడ్మా తన భార్యతో కలిసి విజయవాడలోని ఓ ఆసుపత్రిలో వైద్య చికిత్స కోసం వెళ్లాడు. కొందరు ద్రోహుల సమాచారం మేరకు నవంబర్ 15న పోలీసులు వారిని ఆసుపత్రి వద్దే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ఎస్ఐబీ పోలీసులు హిడ్మా, ఆయన భార్య, అతని అనుచరులను మారేడుమిల్లిలో చంపేశారు'. ఎన్కౌంటర్ తర్వాత హిడ్మా వద్ద ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారనేది పచ్చి అబద్ధమని పేర్కొన్నారు. ఘటనను నిరసిస్తూ నవంబర్ 23న దేశవ్యాప్తంగా బంద్కు పిలుపునిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చడానికి సాధారణ ప్రజానీకంపై ఫాసిస్టు అకృత్యాలకు పాల్పడుతోందని, అందులో భాగంగానే మావోయిస్టులను హతమారుస్తోందని ఆరోపించారు. రంపచోడవరం వద్ద ఏవోబీ రాష్ట్ర కమిటీ సభ్యులు టెక్ శంకర్ సహా పలువురిని కూడా ఈ విధంగానే బూటకపు ఎన్కౌంటర్లలో హతమార్చారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. హిడ్మా ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిపోతారని చెబుతూ, ఈ హత్యకు నిరసనగా మావోయిస్టులు ప్రజలందరినీ బంద్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# ఏసీబీ వలలో 'మిషన్ భగీరథ' చేప

- బిల్లుల క్లియరెన్స్కు రూ.10 వేలు లంచం డిమాండ్
- అసిస్టెంట్ ద్వారా డిజిటల్ పేమెంట్..
- రెడ్హ్యాండెడ్గా పట్టుబడిన డీఈఈ
- జనగామ జిల్లా పాలకుర్తిలో ఘటన

అక్షరదర్బార్, జనగామ: ఎం-బుక్స్ పరిశీలన, మిషన్ భగీరథ పైప్లైన్ పనులకు సంబంధించి తుది బిల్లులను దేవరుప్పుల మండలం అధికారులకు పంపించడం, అక్కడి నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్కు పంపించేందుకు లంచం డిమాండ్ చేసి, నగదు తీసుకుంటూ ఓ మిషన్ భగీరథ అధికారిణి పట్టుబడింది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తిలోని మిషన్ భగీరథ సబ్-డివిజన్ కార్యాలయంలో డీఈఈగా విధులు నిర్వర్తిస్తున్న సంధ్యారాణి మిషన్ భగీరథ పనులకు సంబంధించిన బిల్లుల క్లియరెన్స్కు బాధితుడి నుంచి రూ.10 వేల లంచం డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ ప్రణాళిక ప్రకారం డీఈఈ



శుక్రవారం తన పర్సనల్ అసిస్టెంట్ మహేందర్కు డిజిటల్ పేమెంట్స్ ద్వారా రూ.10 వేలు లంచం తీసుకుంటూ రెడ్హ్యాండెడ్గా పట్టుబడింది. నిందితురాలిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు.

# స్పీకర్ ను కలిసిన కడియం

- పార్టీ ఫిరాయింపుపై వివరణకు మరింత సమయం కావాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పీకర్ స్పందించినట్లు సమాచారం



అక్షరదర్బార్, హైదరాబాద్: స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హైదరాబాద్లోని అసెంబ్లీ స్పీకర్ కార్యాలయంలో శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాదరావును కలిశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక అంశంపై వివరణ ఇచ్చేందుకు తనకు కొంత సమయం కావాలని ఆయన స్పీకర్ను కోరారు. కడియం శ్రీహరి ఈ నెల 23వ తేదీన స్పీకర్ ఎదుట హాజరు కావాలని స్పీకర్ నోటీసుల్లో పేర్కొనగా, తనకు వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని కోరడంతో అందుకు స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. అనర్హత వేటుపై స్పీకర్ నాలుగు నెలల్లో విచారణ పూర్తి చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాగా, మరోవైపు కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, అనంతరం ఉప ఎన్నికలో పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది.

# రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి

## : అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్



అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలంలోని అందుగుర్తాండ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చూడాలని, రైతులకు అవసరమైన సదుపాయాలు వెంటనే కల్పించాలని ఆయన సూచించారు. అనుకూలమైన వడ్లను త్వరగా లోడ్ చేయాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్, చిట్యాల తహసీల్దారు పాల్గొన్నారు.

# మహా రుద్రయాగం చరిత్రలో నిలుస్తుంది

## : ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



పరకాల, అక్షర దర్బార్: పరకాలలో జరిగిన మహా రుద్రయాగం విశిష్టంగా నిర్వహించబడిందని, ఇది చరిత్రలో నిలిచే కార్యక్రమమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శ్రీ కుంకుమేశ్వర ఆలయంలో యాగం కోసం పారిశుద్ధ్య సేవలు అందించిన మున్సిపల్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. యాగాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, యాగ కమిటీ చైర్మన్ ఎర్ర లక్ష్మన్నతో సహా సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కాగా, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, సతీమణి చంద్రకళ జన్మదినం సందర్భంగా ఆలయంలో మహా అన్నప్రసాదం నిర్వహించారు.



# ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

అక్షర దర్బార్, దుగ్గొండి: తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు డా. బండ ప్రకాష్ ముదిరాజ్ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి ముదిరాజ్ ఆధ్వర్యంలో దుగ్గొండి మండలవ్యాప్తంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిర్నిబావి నుంచి దుగ్గొండి వరకు 13 మత్స్య సహకార సొసైటీల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు, జెండా ఆవిష్కరణలు జరిగాయి. వందలాది మత్స్యకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. దుగ్గొండిలో జరిగిన సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 26 లక్షల ముదిరాజులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లేదని, బీసీ–డీ నుండి బీసీ–ఏలో చేర్చి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవలి వర్షాల వల్ల ముదిరాజ్ మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని, వారికి తక్షణ ఆర్థిక సాయం ఇవ్వాలని ఎన్ఆర్ఐ రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల ముదిరాజ్ మహాసభ నాయకులు, మత్స్య సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, ఎన్ఆర్ఐ రాష్ట్ర కన్వీనర్ శానబోయిన రాజ్ కుమార్ ముదిరాజు, జిల్లా నాయకులు పొన్నం మొగిలి ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు నీరటి సదానందం ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె రమేష్ ముదిరాజ్, మండల అధ్యక్షులు ముత్యాల స్వామి, మండల ఉపాధ్యక్షులుజిల్లా నాయకులు గిన్నె భాస్కర్, నేదురు రాజేందర్, , వరంగంటి తిరుపతి,, దండు చిరంజీవి, సొసైటీ అధ్యక్షులు ఈర్ల నరేష్, గొర్రె రామకృష్ణ వరంగంటి కుమారస్వామి, మంద బిక్షపతి, దండు నరసయ్య,మంద యువరాజు, కీసరి రాకేష్, ఈర్ల రమేష్,కోలువుల సాంబయ్య, తౌటి రవి పాల్గొన్నారు.





# అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి



అక్షర దర్బార్, దుగ్గొండి: సమ సమాజ నిర్మాణం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడం ద్వారా మాత్రమే వారి ఆశయాలు సార్థకం అవుతాయని సిపిఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ నాయకుడు గుర్రం విజయ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న అన్నారు. శుక్రవారం తిమ్మంపేటలో సిపిఐ(ఎంఎల్) నర్సంపేట జోనల్ కమిటీ ఆధ్వర్యంలో పొట్ల రామ నరసయ్య 49వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..1976 నవంబర్ 6న రామ నరసయ్యను అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టి పాకాల చెరువు సమీపంలోని చిలకలగుట్ట అడవిలో ఎన్‌కౌంటర్ చేసిన విషయాన్ని నాయకులు స్మరించారు. సభలో ఏఐఎఫ్టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు మోడెం మల్లేశం పాల్గొన్నారు.



# చెకుముకి విజేతలకు బహుమతుల పంపిణీ

చిట్యాల, అక్షర దర్బార్: చిట్యాల మండలంలో చెకుముకి పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు శుక్రవారం బహుమతులను అందజేశారు. ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తహసిల్దార్ షేక్ ఇమామ్ బాబా, ఎస్ఐ హేమ మాట్లాడుతూ, చెకుముకి పోటీల ముఖ్య ఉద్దేశ్యం సమాజంలోని మూఢనమ్మకాలను తరిమికొట్టడమేనని, శాస్త్రసాంకేతిక అవగాహనతో విద్యార్థులు మంచి సమాజ నిర్మాణానికి దోహదపడాలన్నారు. సైబర్ క్రైమ్‌లపై సైన్స్ బోధకురాలు బిట్ల సరళాదేవి అవగాహన కల్పించారు. విజేతలు ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ చల్లగరిగ, ద్వితీయ స్థానం – జడ్పీహెచ్ఎస్ జూకల్, గురుకుల విభాగం: ప్రథమ స్థానం సోషల్ వెల్ఫేర్ వెలుగు పీఎం శ్రీ స్కూల్, ద్వితీయ స్థానం – మోడల్ స్కూల్ చిట్యాల, ప్రైవేట్ పాఠశాలలు: ప్రథమ స్థానం శ్రీ వివేకానంద స్కూల్, ఒడితల, ద్వితీయ స్థానం కాకతీయ హై స్కూల్ నిలిచాయి. విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు అందజేశారు.

# ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ జెండా ఆవిష్కరణ



అక్షర దర్బార్, నల్లబెల్లి : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా నల్లబెల్లి మండల కేంద్రంలో ముదిరాజ్ జెండాను మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు దామ సాంబయ్య ఆవిష్కరించారు. అక్టోబర్ 30న భారీ వర్షాలు, వరదల కారణంగా చెరువుల్లో పోసిన చేప పిల్లలు మత్తడి ద్వారా వెళ్లిపోవడంతో ముదిరాజ్ కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలి అని సాంబయ్య తెలిపారు. ఈ మేరకు స్థానిక MROకు మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ గ్రామ కులసంఘం అధ్యక్షుడు పాండవుల రాంబాబు, గోనెల నరహరి, గుండాల శ్రీశైలం, మేకల రాజయ్య, జక్కుల కుమారస్వామి, పిట్టల ప్రవీణ్, పెండ్యాల మహేందర్ రెడ్డి, రాజన్న, మధుకర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.




# అటవీ సంపద దోచుకోవడానికే ఆపరేషన్ కగార్

## ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

అక్షర దర్బార్, నర్సంపేట: అడవులు, ఖనిజాలపై కార్పొరేట్ ఆధిపత్యం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసీలపై బూటకపు ఎన్కౌంటర్లు జరుపుతుందని ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఆరోపించారు. నర్సంపేటలో ఎంసిపిఐ(యు) డివిజన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అడవులను, ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు అడ్డుగా ఉన్న గిరిజనులను భయాందోళనలకు గురిచేసే చర్యలే ఇవని అన్నారు. బూటకపు ఎన్కౌంటర్లపై విచారణ జరిపి, లొంగిపోయిన మావోయిస్టులను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, రాష్ట్ర నాయకులు కన్నం వెంకన్న, వంగల రాగసుధ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ మత్స్యకారులను ఆదుకోవాలి

## : చింతల రమేష్ ముదిరాజ్



అక్షర దర్బార్, చిట్యాల : ముదిరాజ్ మత్స్యకారులు ఆర్థిక–సామాజికంగా వెనుకబడిన వర్గమని, వారికి ప్రత్యేక పథకాలు అమలు చేసి ప్రభుత్వం ఆదుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి చింతల రమేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. చిట్యాల మండలంలో జరిగిన మహాసభ 11వ వార్షికోత్సవం, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ—— ముదిరాజులకు ఉచిత చేపపిల్లల బదులుగా నగదు సకాలంలో ఇవ్వాలని, బీసీ–ఏ గ్రూపులో చేర్చాలని కోరారు. ముదిరాజ్ కోఆపరేటివ్ కార్పొరేషన్‌కు 1000 కోట్ల బదులుగా 50 కోట్లు మాత్రమే కేటాయించడం సరైందికాదని, 50 ఏళ్లు దాటిన ప్రతి మత్స్యకారుడికి పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల, జిల్లా ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు

అక్షర దర్బార్, భూపాలపల్లి : జిల్లా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నేతలు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రం సతీష్ కుమార్, కార్యదర్శి గుజ్జ సారేశ్వరరావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఇండ్లస్థలాలు, ఇండ్లు, అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, రిటైర్డ్ జర్నలిస్టులకు పింఛన్లు, మహిళా జర్నలిస్టులకు రాత్రివేళ రవాణా వంటి సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తెస్తున్నామని తెలిపారు. జిల్లాలో 500 మంది జర్నలిస్టులు ఉండగా కేవలం 274 మందికే అక్రిడిటేషన్ కార్డులు ఉన్నాయన్నారు. ఏడాదిన్నర నుంచి తాత్కాలిక స్టిక్కర్ల తోనే విధులు నిర్వహించాల్సి వస్తుందని, శాశ్వత కార్డులు వెంటనే జారీ చేయాలని కోరారు. జిల్లా కేంద్రంతో పాటు రేగొండ, టేకుమట్ల మండలాల్లో ఇప్పటికే పట్టాలు పొందిన జర్నలిస్టులకు స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. కొందరు ప్రైవేట్ పాఠశాలలు జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ అమలు చేయకపోవడం పట్ల చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు కొలుగూరి సంజీవరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చింతల కుమార్ యాదవ్, గాదె రమేష్, రోంటా ల శంకర్,జిల్లా ఉపాధ్యక్షులు ములకల లక్ష్మారెడ్డి,కోశాధికారి మండల రాంబాబు, జాయింట్ సెక్రెటరీ టి. దుర్గయ్య, తెలంగాణ బ్రాడ్ కాస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆకుతోట ప్రవీణ్ కుమార్, కోశాధికారి భాస్కర్, మీడియా కన్వీనర్ పుల్ల సృజన్, జిల్లా కమిటీ సభ్యులు రమేష్, రహీం పాషా, జోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.




# బాధ్యతలు చేపట్టిన మాదారం పీఏసీఎస్ కమిటీ

అక్షర దర్బార్, పరకాల: హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు మాదారం పీఏసీఎస్ కమిటీ శుక్రవారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ లింగమూర్తి మాట్లాడుతూ నిరాధారమైన ఆరోపణలతో పాలకవర్గాన్ని తొలగించారని కానీ కోర్టు తీర్పు ద్వారా తిరిగి మళ్లీ పదవులు ఇవ్వడం ధర్మం ఎప్పటికీ గెలుస్తుంది అనేది రుజువైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, రావుల విజేందర్ రెడ్డి , దోమ మహేందర్ , జంగిలి రాజ నర్సయ్య , కొమ్మిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు,

# బీజేపీ స్టేట్ చీఫ్ ను కలిసిన లాడే శివ



పరకాల, అక్షర దర్బార్: హనుమకొండ జిల్లా శాయంపేట మండల బీజేపీ యువ నాయకుడు లాడే శివ, హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ విస్తరణ, బలోపేతంపై చర్చించారని లాడే శివ తెలిపారు. యువత పార్టీకి ఆస్తి అని రామచంద్ర రావు పేర్కొంటూ, గ్రామస్థాయిలో కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు.

# దుగ్గొండి ఏవోను కలిసిన కాంగ్రెస్ నాయకులు



అక్షర దర్బార్ ,దుగ్గొండి : ఇటీవల నూతనంగా దుగ్గొండి మండల వ్యవసాయ అధికారి బాధ్యత చేపట్టిన గాజుల శ్యామ్ నీ శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎడెల్లి శ్రీనివాస్ రెడ్డి,ధారావత్ రాజు,కూరతోట సురేష్, అజ్మీర తిరుపతి, శంకేసి రమేష్, బండారి ప్రకాష్, డ్యాగం శివాజీ, కొలుగూరి సుమంత్ తదితరులు ఉన్నారు.



### ప్రజా సంక్షేమమే

# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**



అక్షర దర్బార్, పరకాల: అన్ని వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల, నడికూడ మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 55 మంది లబ్ధిదారులకు రూ.55,64,080 విలువైన కళ్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ చెక్కులు, అలాగే 27 మంది లబ్ధిదారులకు రూ.6,78,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ప్రజా సంక్షేమం కోసం ఉచిత బస్ ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కి గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు వంటి హామీలను అంచెలంచెలుగా అమలు చేస్తున్నామని ఆయన అన్నారు.



# జీసీడీఓ, ఎస్ఓను విధుల నుంచి తొలగించాలి

- డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్

అక్షర దర్బార్, కేసముద్రం : గత కొన్ని రోజులుగా కేసముద్రం మండలం కల్వల గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థులకు పురుగుల అన్నం, కుళ్ళిపోయినా కూరగాలతో వంట చేయడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపడుతున్న విద్యార్థులకు అండగా శుక్రవారం డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్వల మోడల్ స్కూల్ ని సందర్శించి విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అలాగే దాదాపు యాభై మంది విద్యార్థులు ఉన్న హాస్టల్ కి సరైన రక్షణ కరువైందని వాపోయారు. గతంలో హాస్టల్ ని కలెక్టర్, ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, రక్షణ కల్పించాలని అధికారులను అదేశించినా వారు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీసీడీఓ (గర్ల్స్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్), అలాగే ఎస్ఓని విధుల నుండి తొలగించాలని వారు డిమాండ్ చేసారు. కార్యక్రమంలో డిఎస్ఏ జిల్లా నాయకులు భువన్, రాజులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పథంలో కేసముద్రం

# సింగిల్ విండో సొసైటీ



అక్షర దర్బార్, కేసముద్రం : కేసముద్రం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాన్ని 14 సెప్టెంబర్ 2025న డీసీవో రద్దు చేయగా, హైకోర్టు ఆదేశాల మేరకు 19–11–2025 న తిరిగి పునరుద్ధరించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ దీకొండ వెంకన్న, వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ— 2020లో ఎన్నికైన సమయంలో సొసైటీ అద్దె భవనంలో కనీస వసతులు లేకపోయినా, తమ పాలకవర్గం చేపట్టిన చర్యలతో సంఘం అభివృద్ధి సాధించిందన్నారు. 30 ఏళ్ల క్రితం స్థానిక దాతలు ఇచ్చిన 20 గుంటల భూమి నేడు కోట్ల విలువైన ఆస్తిగా రక్షించామని తెలిపారు. నాబార్డ్ నిధులతో రూ.21 లక్షల కార్యాలయం, రూ.36 లక్షల 500 MT గోదాం నిర్మించామని, సంఘాన్ని C గ్రేడ్ నుండి A గ్రేడ్‌కు తీసుకువచ్చిన ఘనత తమదేనని చెప్పారు. వరి, మక్కల కొనుగోళ్ల ద్వారా వచ్చిన కమిషన్‌లో రూ.50 లక్షలు FDగా జమ చేశామని, ఇంకా ప్రభుత్వం నుంచి రూ.28 లక్షలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. రైతులకు రూ.4.75 కోట్లు విలువైన ఎరువులు, రూ.4 లక్షల విత్తనాలు సరఫరా చేశామని, 826 మంది రైతులకు రూ.4.20 కోట్లు పంట రుణాలు ఇవ్వగా, 376 మంది రైతులకు రూ.2.19 కోట్లు రుణమాఫీ జరిగిందని తెలిపారు. తమపై ఎలాంటి తప్పులు లేవని, మొక్కజొన్న నిల్వల తరలింపులో ఆలస్యమే కమిటీ రద్దుకు కారణమైందని చెప్పారు. కోర్టు ద్వారా పునరుద్ధరణ జరగడంతో రైతులకు మరింత సేవ చేసే అవకాశమిచ్చినందుకు డీసీవోకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, నంద, యాకన్న, లక్ష్మయ్య, రాంజీ, లక్ష్మీ బిక్షం, శోభ, నాగన్న పాల్గొన్నారు.

# టిప్పర్ ను ఢీకొని యువకునికి తీవ్రగాయాలు



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. సీఎస్ఐ కాలనీకి చెందిన బొచ్చు ప్రసంగి (24) పాల డైరీ కేంద్రంలో ఉద్యోగం చేస్తున్నారు. శుక్రవారం పనికి వెళ్లే క్రమంలో హనుమకొండ రోడ్డులోని స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో ఆగి ఉన్న టిప్పర్‌ను అతను నడుపుతున్న ద్విచక్రవాహనం అతివేగంతో వెనకవైపు ఢీకొన్నట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితుడిని 108 సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఎమ్మెల్యేను కలిసిన పెద్దకోడెపాక రజక కులస్తులు

అక్షర దర్బార్ శాయంపేట: శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామ మడేలయ్య రజక సంఘం నాయకులు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ను హన్మకొండలోని వారి గృహంలో కలిశారు.ఈ సందర్భంగా గ్రామంలోని చాకలి రేవు కుడి చెరువు వద్ద కులదైవమైన మడేలయ్య ఆలయం నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని మడేలయ్య, సీతల దేవత, ఈదమ్మ, వినాయకుడు, నంది, శివలింగం విగ్రహాలను బహుకరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు.



# ప్రగతి పథంలో నడపాలి

**- మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్**




అక్షరదర్బార్, వరంగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి.. జిల్లాను ప్రగతి పథంలో నడపాలని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీ బలరాంనాయక్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు. ముందుగా ఇటీవల దక్షిణ భారతదేశంలో జల సంరక్షణ కేటగిరి– 2లో వరంగల్ జిల్లా మొదటి స్థానం దక్కిన నేపథ్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతో పాటు రూ.కోటి దక్కించుకొని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన విషయమై దిశ వేదికగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారదను ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు శాలువలు కప్పి అభినందించారు. జిల్లాలో జల సంరక్షణ చర్యలను విజయవంతంగా చేపట్టి రాష్ట్రానికి ప్రతిష్ఠ తెచ్చారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న నిధులను సక్రమంగా వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాబట్టుకొని ప్రజా ప్రతినిధులు అధికారుల సహకారంతో జిల్లాను ప్రగతి పథంలో తీసుకెళ్తామని అన్నారు. దారిద్ర రేఖకు దిగువన ఉన్న ప్రతి పేద కుటుంబాలకు, గిరిజన కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలు చేరే విధంగా సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి అమలయ్యే విధంగా చూడాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సౌకర్యాల లోపం లేకుండా చూడాలని, ప్రభుత్వ హాస్టల్స్‌లో వేడి నీటి కోసం గీజర్లు లేని హాస్టల్స్ జాబితాను పంపితే, త్వరితగతిన వాటిని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం వద్ద ఖాళీగా ఉన్న భూములను కూరగాయల సాగుకు లీజు మీద ఇవ్వాలని సూచించారు.






# ముదిరాజ్ మహాసభ జెండా ఆవిష్కరణ

అక్షర దర్బార్, మల్హర్ : ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్హర్ మండలంలోని తాడిచెర్ల గ్రామంలో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా యూత్ ఉపాధ్యక్షులు ముద్రవేని సురేష్ ముదిరాజ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన సురేష్ ముదిరాజ్, ముదిరాజ్ వర్గాన్ని బీసీ–డీ నుంచి బీసీ–ఏ కేటగిరీకి మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ వర్గం ఏకతాటిపై నిలిచి, రాజకీయ సత్తా చాటాలని కులస్థులకు పిలుపునిచ్చారు.



# కాంగ్రెస-బీజేపీ కలిసి కేటీఆర్ పై కుట్ర

**కేటీఆర్ సేన భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు భరత్ రెడ్డి**

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం అక్రమ కేసులతో ఒత్తిడి తీసుకురావాలని చూడటం మూర్ఖత్వమని కెటిఆర్ సేన భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు వీసం భరత్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఫార్ములా–ఈ రేసు అంశంపై రేవంత్ సర్కారు మళ్లీ డ్రామాలు ఆడుతోందని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన కేటీఆర్‌ను టార్గెట్ చేయడానికే కాంగ్రెస్–బీజేపీలు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ ప్రయోజనాల కోసం ఈ కుట్రలు జరుగుతున్నాయని అన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఎమ్మెల్యేగండ్ర సత్యనారాయణ రావు**




అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం నేరేడుపల్లి, ప్రగతి సింగారం, వసంతాపూర్, కొప్పుల గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు ప్రారంభించారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వ నియమాలు కచ్చితంగా పాటించాలని, ఎలాంటి అక్రమ కటింగ్‌లు జరిగినా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పిటిసి చల్ల చక్రపాణి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బోనపెల్లి రఘుపతి రెడ్డి,దుబాసి కృష్ణమూర్తి,చిందం రవి, సామల మధుసూదన్, కోసరి గోపాల్, హింగే భాస్కర్, ఎక్ శంకర్, మూలగుండ్ల సందీప్ రెడ్డి, రైతులు అధికారులు పాల్గొన్నారు.

# మిత్రుడికి స్నేహితుల ఆర్థిక సాయం



అక్షర దర్బార్, వెంకటాపూర్ : వెంకటాపూర్ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన కళ్లెపు పైడి మరణించగా, విషయం తెలుసుకున్న ఆయన చిన్ననాటి స్నేహితులు ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ పరిస్థితిని తెలుసుకొని, తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10వేలు అందించారు. మా మిత్రుని అకస్మాత్తు మరణం తీరనిలోటు అని వారు తెలిపారు. పైడి కుటుంబానికి స్నేహితులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుల్యాల రమేష్, శంకర్, అశోక్, ప్రసాద్, కుమార్, శ్రీనివాస్, ప్రేమ, విజయ, సునీత, సునంద తదితరులు పాల్గొన్నారు.

# అనాథ శవానికి పోలీసుల అంత్యక్రియలు

- **ఎవరు లేకున్నా మేమున్నాం అంటున్న ములుగు పోలీసులు**



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లా కేంద్రంలో మూడు రోజుల కిందట మరణించిన అనాథ శవానికి ములుగు పోలీసుల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎస్సై వెంకటేశ్వర రావు తెలిపారు. ములుగు మండల పరిధిలో మానసిక స్థితి సరిగా లేక బిక్షం ఎత్తుకుంటూ నివసిస్తూ ఈనెల 18న ఒక వ్యక్తి మరణించాడు. అట్టి వ్యక్తికి శుక్రవారం ములుగు పోలీసులు ఎస్ హెచ్ ఓ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. వ్యక్తి ఆనవాళ్లు తెలుసుకోనుటకు నిబంధనల ప్రకారం మీడియా ద్వారా ప్రకటన జారీ చేసి స్పందన రాకపోవడంతో అనాథ శవానికి తన సిబ్బందితో కలిసి అంత్యక్రియలు దగ్గరుండి జరిపించారు. ములుగు పోలీసులు చేసిన ఈ పనిని "కరకు ఖాకీ మాటున దాగి ఉన్న కరుణను, మానవీయ విలువలను" ప్రజలు, మానవతవాదులు మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 32 మంది ఐపీఎస్ ల బదిలీ

- **పాతవారికి స్థానిక చలనం.. కొత్తవారికి పోస్టింగ్స్**
- **ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామనాథ్**
- **భూపాలపల్లి ఎస్పీగా సిరిసెట్టి సంకీర్త్**
- **మహబూబాబాద్ ఎస్పీగా శబరీశ్**

అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం భారీగా ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల్లో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న పలువురు అధికారులకు పోస్టింగులు లభించాయి. మరికొందరు బదిలీ అయ్యారు. దీనిలో భాగంగా ములుగు ఎస్పీగా కేకన్ సుధీర్ రామనాథ్, భూపాలపల్లి ఎస్పీగా సిరిసెట్టి సంకీర్త్, మహబూబాబాద్ ఎస్పీగా శబరీశ్ బదిలీ అయ్యారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్

- **నగర మేయర్ గుండు సుధారాణి**
- **కమిషనర్ తో కలిసి టీజీ - సీయూఆర్టీఐ సమావేశం**

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ఏర్పాటుకు డీపీఆర్ రూపకల్పన చేస్తున్నట్టు నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. తెలంగాణ క్లైమేట్ రెసిడెంట్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇనిషియేటివ్ (టిజీ – సీయుఆర్టీఐ) ఆధ్వర్యంలో 'ప్రాథమిక అంచనా మిషన్'కు చెందిన అర్బన్ డెవలప్మెంట్ సౌత్ ఏసియా హెడ్ ఆఫీస్ కు సంబంధించిన కార్లా బెర్క్, అర్బన్ మొబిలిటీ హెడ్ న్యూడిల్లీకి చెందిన ఆళ్వారో చెర్రీల్, అర్బన్ డెవలప్మెంట్ సౌత్ ఏసియా పోర్ట్ పోలియో లూకాస్ మయి, సీనియర్ అర్బన్ సెక్టార్ స్పెషలిస్ట్ న్యూడిల్లీకి చెందిన కిరణ్ అవధానుల బృందం నగరంలో పర్యటించిన నేపథ్యం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి పాల్గొని నగరంలో చేపట్టబడి కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వరంగల్ అభివృద్ధికి సీఎం రేవంత్చరెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని అన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి తక్షణ సహాయం కింద రూ.12 కోట్లు విడుదల చేశారని చెప్పారు. ముంపునకు శాశ్వత పరిష్కారం కనుక్కోవడానికి వీలుగా డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించడం జరిగిందని, ఇందులో భాగంగా రూ.1200 కోట్లతో తయారుచేసి అందించారని అన్నారు. ప్రస్తుతం 66 డివిజన్ లతో పాటు 44 విలీన గ్రామాలు నగర పరిధిలో ఉన్నాయని, వరద ముంపు ఎదుర్కోవడానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అత్యంత అవసరం అని, బల్దియా పరిధిలో నీటి సరఫరా కోసం రూ.544 కోట్లు కేటాయించడం జరిగిందని, సాస్కి కార్యక్రమంలో భాగంగా పురాతన బావులను 15 స్టెప్ వెల్స్ ను పునరుద్ధరించామని మేయర్ తెలిపారు. అనంతరం సౌత్ ఏసియా, న్యూఢిల్లీకి చెందిన ప్రతినిధులను మేయర్ కమిషనర్ లు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915